
# గ్రేట్ వాటర్ షో - 2025

సూరేపల్లి విజయ



**గ్రేట్ వాటర్ షో - 2025**

హైద్రాబాద్, వైజాగ్, కాకినాడలలో జరిగే గ్రేట్ వాటర్ షో - 2025ని తిలకించాలని అనుకుంటున్నారా? వాటర్ ఎగ్జిబిషన్‌లో మంచి నీటి కుళాయిల గురించి, వర్షం గురించి, స్నానం చేయడం గురించి తెలుసుకోవాలని అనుకుంటున్నారా? ఒకప్పుడు టాంక్ బండ్ లో నీళ్ళు ఎలా వుండేవో ఊహా చిత్రాన్ని చూడాలనుకుంటున్నారా? వైజాగ్ సముద్రం ఫోటో ఎగ్జిబిషన్ సందర్శించాలా.... నీళ్ళను ముట్టుకున్న అనుభూతిని అందించే గ్రేట్ వాటర్ షో - 2025ని సందర్శించాలనుకునేవారు సంప్రదించండి.

- సతీష్, (గైడ్)
**984047126912**

ఆవేళ్టి అన్ని ప్రముఖ పత్రికల్లో వచ్చిన ప్రకటన అది. ఆ రోజు మార్చి 24, 2025

***

ఏవండీ...గ్రేట్ వాటర్ షో – 2025 కు వెళ్దామా. చారుమతి అడిగింది. అన్నం తిని ఓ వాటర్ టాబ్లెట్ నోట్లో వేసుకుంటూ.

''వ్వాట్....గ్రేట్ వాటర్ షో...కా...మరి నాన్నను ఎవరు చూసుకుంటారు?'' అడిగాడు అటక మీద కోమాలో వున్న తన తండ్రి చూస్తూ చారుమతి భర్త చలపతి.

హు...హు...హు...హు... ఇరవయ్యేళ్ళ క్రితం పెళ్ళయిన కొత్తల్లో కోమాలోకి వెళ్లిన వ్యక్తి, ఇంతవరకూ ఉలుకు లేదు పలుకూ లేదు... ఆయనను చూసుకునేదేమిటి.. అటక మీద వున్నా మీ నాన్న స్టోర్ రూమ్‌లో వున్న పాత సామాను... ఒక్కట్టే.... 'హ' కు రకరకాల దీర్ఘాలు తీస్తూ అంది చారుమతి.

''చా...రూ...హంత మాటనకు... ఆయన మన కోసమే కోమాలోకి వెళ్ళాడు... నీకు గుర్తుందా...నీకు గుర్తుందా...నీకు గుర్తుందా...''

'హబ్బ...అలా మూడుసార్లు అని ఫ్లాష్‌బ్యాక్‌కు వెళ్ళాల్సిన అవసరం లేదు. కళ్ళజోడు పెట్టుకొని, మార్చి 2005లోకి వెళ్ళండి. నన్ను లాక్కెళ్ళకండి ఆ ఫ్లాష్‌బాక్స్‌లోకి అంది విసవిస కిచెన్‌లోకి వెళ్తూ.

కాసేపలా ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళాడు చలపతి.

***

అది మార్చి 2005.

అప్పటికి నీటి కరువు పాపభారంలా దేశ జనాభాలా, పెరిగిపోయింది. చలపతి తండ్రి ఆ కాలనీలో చిన్నపాటి వస్తాదు కూడా...చలవపతికి కొత్తగా పెళ్ళయింది. అందులోనూ ఆ వేళ వాళ్ళ ఫస్ట్‌నైట్. పాలగ్లాసుతో పెళ్లి కూతురు శోభనం గదిలోకి అడుగు పెట్టాల్సిన రోజు.

పాలల్లో కలపడానికి నీళ్ళు లేక హండ్రెడ్ పర్సెంట్ చిక్కటి పాలనే తెచ్చిచ్చాడు పాలబ్బాయి.

వారానికొకసారి ట్యాంకర్ వస్తుంది. కుళాయిలు మాసపత్రికలా నెలకొసారి రావడం మొదలెట్టాయి.

కొడుకు, కోడలని శోభనం గదిలోకి పంపి 'ఆల్ ది బెస్ట్' అని దీవించి రాత్రి పదిగంటల నుంచే వాటర్ టాంకర్ దగ్గర ఇనుపరాడ్ చేతిలో పట్టుకొని కాపు కాసాడు.

అదే సమయంలో, ఇంటికో మహిళ బలిదానం సైన్యంతో, సూసైడ్ స్క్వాడ్‌తో మంచినీళ్ళ కోసం బిందెలతో మొహరించారు. నీళ్ళ ట్యాంకర్ వచ్చింది. ఆ వెనుకే పోలీసు బలగమూ వచ్చింది. అయిన అప్పటికే యుద్ధం మొదలైంది. చలపతి తండ్రి తన 'దాదాగిరి' ని చూపించబోయాడు.

మహిళల బిందెల ముందు, ఎలాగైనా నీళ్ళు పట్టుకోవాలన్న బలీయమైన కోరిక ముందు అతని దేహదారుడ్యం ఎందుకు కొరకాకుండ పోయింది.

పోలీస్ సైరన్స్, అంబులెన్స్‌లు, వన్ ఫార్టీ ఫోర్ సెక్షన్...కర్ఫ్యూ వాతావరణం...సగం నీళ్ళు నేలపాలే... ఆ నాటి యుద్ధంలో చలపతి తండ్రి తీవ్రగాయాల పాలయ్యాడు.

ఆసుపత్రి పాలయ్యాడు. అట్నుంచి అదే కోమాలోకి చెక్కేసాడు.

శోభనం పెళ్ళి కూతురు సిగ్గుకు బదులు చికాకుతో మామగార్ని పరామర్శించింది. డాక్టర్లు ఐసియులో అట్టె పెట్టలేమని.... రెంట్ భరిస్తే తప్ప కుదర్దని తేల్చి చెప్పేసారు.

తండ్రిని ఇంటికి తీసుకు వచ్చాడు చలపతి. మొదటి రోజు తన గదిలో తన మంచమ్మీద పడుకోబెట్టి తనే విసనకర్రతో విసిరాడు.

రెండవరోజు మామగారికి బలవంతగానైనా జావ తాగించబోయింది చారుమతి.

ఒక నెల గడిచింది. కోమాలో నుంచి బయటకు రాలేదు. చలపతి తండ్రి. చారుమతికి ఓపిక నశించి మామగారిని కిచెన్‌లోకి మార్పించింది.

రెండు నెలలు గడిచాయి. కోమాలోని మనిషిలో ఏ మూవ్‌మెంట్ లేదు. కిచెన్‌లో అడ్డుపడుతున్నాడని హాలులోకి మార్పించింది. మూడు నెలలు గడిచాయి. విజటర్స్, అదే చుట్టాలో స్నేహితులో వచ్చి చలపతి తండ్రిని చూసి డెడ్ బాడీ యేమో అనుకొని హడలి చచ్చేవాళ్ళు.. పైగా అదే ఎగ్జిబిషన్ అయింది.

వెంటనే స్టోర్ రూమ్‌లోకి మార్చారు. రెండేళ్ళయింది. మూడేళ్ళయింది, నాలుగైంది, అయిదొచ్చింది. చలపతికి బుల్లి చలపతి పుట్టాడు.

ఆడుకుంటూ స్టోర్ రూమ్‌లోకి వెళ్లి ఆ...య్... మనిషి బొమ్మ అంటూ తాతయ్య ముక్కుకు వున్న ఆక్సిజన్ గొట్టం పీకి...పాకాన పెట్టి ఆడుకోసాగాడు. అట్టాగయితే తండ్రి కోమాలోంచి, కైలాసానికే వెళ్తాడని, డిసైడై అటక మీదికి షిఫ్ట్ చేసేసాడు చలపతి.

అదీ ఫ్లాష్ బ్లాక్. అట్టా ఇరవయ్యేళ్ళు గడిచాయి. ఈ ఇరవయ్యేళ్లలో బోల్డు మార్పులు. నీళ్ళు అడుగంటి పోయాయి. విదేశాల కల్చర్, ఇక్కడ కంపల్సరీ అయింది. టాయిలెట్ పేపర్స్ వాడుకలోకి వచ్చాయి. జల శాస్త్రజ్ఞులు వాటర్ టాబ్లెట్స్ కని పెట్టారు.

టిఫిన్ చేసేక అన్నం తిన్నాక వేసుకోవాలి.

దాహం వేస్తే జాగ్రత్తగా వాడుకోవాలి. నీటికి ప్రత్యామ్నాయ మార్గాలు మొదలయ్యాయి. స్నానం చేసే ప్రక్రియ దాదాపు ప్రపంచమంతా మాయమైంది.

ప్రతీ యింట్లోను బాడీ ఫెర్‌ఫ్యూమ్‌లు కామన్... వర్షాలు లేవు చిరపుంజీలో సంవత్సరంలో ఒక్క గంటా, రెండు గంటలో చిన్న వర్షం కురుస్తుంది.

ఆ నీటిని జాగ్రత్తగా రిజర్వ్ బ్యాంక్‌లో దాచి వాడుకోవాలి. నీటిని పొదుపుగా వాడకపోవడం, అందుబాటులో వున్నవారు కాలుష్యం బారిన పడటం జల యజ్ఞం, నీరు మీరు, నదీజలాల అనుసంధానం లాంటి జల సంరక్షణ పథకాలు ఎన్ని వున్నానేతల్లో చిత్తశుద్ధి లోపించి నీటి శుద్ధి కొడిగట్టి పోయింది.

***

గ్రేట్ వాటర్ షో 2025


టాంక్‌బండ్ గ్రౌండ్... వేసవి సెలవుల్లో హైద్రాబాద్ వచ్చిన వాళ్ళు, విదేశీయులు అక్కడ వున్నారు. వాళ్ళ ముందు ఠీవిగా నిలబడి వాళ్ళకు ఎక్స్‌ప్లెయిన్ చేస్తున్నారు గైడ్ సతీష్.

'వాటీజ్ దిస్...' ఓ విదేశీయుడు ట్యాంక్‌బండ్ గ్రౌండ్ చూపించి అడిగాడు.

## యాక్టింగ్ నాకో ఛాలెంజ్

**'సినిమాల్లో కంటే టివి యాక్టింగ్‌లో ఒత్తిడి ఎక్కువ. అందుకే నేను ఛాలెంజింగ్‌గా తీసుకుంటున్నాను' అంటుంది అమ్నాషరీఫ్. బాలాజీ టెలిఫిలిమ్స్ సీరియల్స్‌లో ఎక్కువగా కనిపించే అమ్మా సాంప్రదాయిక కుటుంబంలోంచి వచ్చింది. ఇంట్లో కొంత ప్రతిఘటన ఎదురైనా, యాక్టింగ్‌పై వున్న అపారమైన ప్రేమతో యాడ్‌ఫిలిమ్స్‌లో నటించటం మొదలెట్టింది. క్లోజప్, ఇమామి మొదలైన యాభై యాడ్స్‌లో నటించింది. దాంతో అందరి దృష్టిలో పడింది. కుమార్‌సాను విడియో ఆల్బంలో ఛాన్స్ దక్కింది. తరువాత బాలాజీ సీరియల్స్‌లో వరుసగా నటించింది. సుజల్ అనే నటుడితో బాగా దగ్గరగా మెలిగే అమ్నా, తమ మధ్య ఏమీ లేదని అంటూ వున్నా, పత్రికలు మాత్రం తెగరాసేస్తున్నాయి. ఆమె నటిస్తున్న 'కహితో హోగా' టాప్ 20 సీరియల్స్‌లో ఒకటి.**






'ఇరవయ్యేళ్ళ క్రితం ఇక్కడ నీళ్ళు వుండేవి. ఆ నీళ్ళ మధ్యలో బుద్ధుడు హాయిగా వుండేవాడు. నీళ్ళ కరువొచ్చేక, నీళ్ళెండి... ఈ టాంక్‌బండ్ గ్రౌండ్‌గా మారింది. ఇప్పుడిక్కడ ఎగ్జిబిషన్లు, సమావేశాలు జరుగుతాయి. వెల్కం టు గ్రేట్ వాటర్ షో...' అంటూ ఎగ్జిబిషన్‌లోకి తీసుకు వెళ్ళాడు సతీష్.

***

''ఇది వైజాగ్ బీచ్ ఫోటో... ఒకప్పుడు సముద్రం బీచ్ ఎలా ట్విన్స్‌లా కలిసి వుండేవో చూడండి.''

''అబ్బా.....నీళ్ళు.... ఎన్ని నీళ్ళో....'' పిల్లలు కేరింతలు కొట్టారు ఆ ఫోటో చూసి

''సముద్రాన్ని కబ్జా చేసి, కాంప్లెక్సులు, అపార్ట్‌మెంట్లు కట్టేసారు. ఇప్పుడక్కడ బీచ్ తప్ప సముద్రం లేదు'' సతీష్ వివరంగా చెప్పాడు.

విదేశీయులు నోరెళ్ళ బెట్టారు.

''కాకినాడలో ఓడరేవుంది.... ఒకప్పుడు ఓడలు ఇక్కడ కనువిందు చేసేవి. ఓ ఫోటో చూపించి చెప్పాడు. ఇప్పుడు ఓడలే తప్ప....నీళ్ళు లేవు... కరువు మండి నీళ్ళు ఎండిపోయాయి...'' సతీష్ దీర్ఘంగా నిశ్వసించి చెప్పాడు.

''వాహ్... ఇదేమిటి?''

''దిసీజ్ గ్లాసు... వెండిగ్లాసు.. .. అందులో వున్నది నీళ్ళు...మమ్మీఫికేషన్ టైపులో వాటరిఫికేషన్ చేసారు. కొన్ని రసాయన ప్రక్రియలతో నీళ్ళను పాడై పోకుండ భవిష్యత్తరాల కోసం అట్టిపెట్టాం''. ఓ గాజు బాక్సులు వున్న వెండిగ్లాసును అందులో వున్న నీళ్ళను చూపించి చెప్పాడు సతీష్.

''అంకుల్ ఓసారి ఆ నీళ్ళను ముట్టుకోవచ్చా....'' కొందరు పిల్లలు ఆసక్తిగా అడిగారు. అందులో చారుమతి - చలపతిల పుత్రరత్నం కూడా వున్నాడు.

నోనో.... పదేళ్ళ క్రితం... ఇలా దొంగతనంగా ఆ నీళ్ళను ముట్టుకోవడం వల్ల పది చుక్కల నీళ్ళు తగ్గిపోయాయి. విబిఐ(వాటర్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్) చేసి అమూల్య సంపద అయిన నీళ్ళను పది చుక్కల వరకూ వృధా చేసినందుకు వాళ్ళ మీద కేసు ఫైల్ చేసింది. అప్పట్నుంచి ఇలా భద్రంగా ఎలక్ట్రానిక్ గ్లాసు బాక్స్‌ల మధ్య నీళ్ళ గ్లాసును ప్రదర్శనకు పెట్టామని చెప్పాడు సతీష్.

***

ఒకప్పటి ట్యాంకర్స్‌ని చూపించాడు సతీష్. తరువాత ఓహాలులోకి తీసుకు వెళ్ళాడు. ఓ వానపాట చూపించాడు.

పిల్లలు, అతిథులు సందర్శకులు కేరింతలు కొట్టారు అబ్బా నీళ్ళు ఎన్ని నీళ్ళో... అంటూ చంకలు గుద్దుకున్నారు.

''ఇది పదహారేళ్ళ క్రిందట ఓ సినిమాలోని వాన పాట. అదే చివరి వానపాట... మా సినిమాలో వాన పాట కోసం నయాగారా జలపాతం నుంచి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి నీటిని తెప్పించి చిత్రీకరించిన వాన పాట.. అని అప్పట్లో పెద్ద పబ్లిసిటీ తో ఆ సినిమా విడుదల అయింది. ఆ వానపాటలో నీళ్ళను చూసేందుకు ప్రేక్షకులు విరగబడి వచ్చారు.'' సతీష్ చెప్పుకుపోతున్నాడు.

తర్వాత మరోషో.... ఆ హాలు బయట వర్షం పడుతున్న ఎఫెక్ట్. స్క్రీన్ మీద వర్షాన్ని చూసి ఎంజాయ్ చేస్తున్నారు....

***

''ఇదేమిటి''... ఓయుద్ధం ఫోటోని చూసి అడిగాడు విదేశీయుడొకడు.

''అది పానీ పట్టు యుద్ధం''.

''యూ మీన్ పాని పట్టు యుద్ధం''. ఓ తెలుగు వాడు ఇంగ్లీషులో డౌట్ పీకాడు.

''ఐ మీన్ పానీ....పట్టు యుద్ధం....నీళ్ళ (పానీ) కోసం పట్టు ( ఓ పట్టు పట్టి) యుద్ధం చేసినప్పటి దృశ్యం. ఈ యుద్ధంలో దేశవ్యాప్తంగా ఆరుకోట్ల మంది గాయపడ్డారు. నీళ్ళ కోసం జరిగిన ఈ యుద్ధంలో రెండు అణుబాంబులు కూడా ప్రయోగించబడ్డాయి''.

చిన్నపిల్లలు.. ముక్కున వేలేసుకున్నారు.

ఆ తర్వాత ప్రపంచమంతా నీటి కరువు రావడం నీళ్ళకోసం కాలనీలు ఊళ్ళు, జిల్లాలు, ఆ తర్వాత రాష్ట్రాలు (వాటాల కోసం) దేశాలు గొడవపడ్డం, సౌదీ, కువైట్ లాంటి దేశాల వాళ్ళు పెట్రోల్ బావులతో మన మంచి నీళ్ళ బావుల్ని ఎక్స్చేంజ్ చేసుకునే పరిస్థితికి రావడం... ఈ నేపథ్యంలో నీళ్ళ కరువు ఎక్కువైంది. ఒక్కక్షణం ఆగాడు సతీష్.

''ఇదేమిటి'' గ్రేట్ వాటర్ షో 2025 లో వున్న ఓ పత్రికను చూపించి అడిగారు విదేశీయులు.

''ఇది మా రాష్ట్రంలో అత్యధిక సర్క్యులేషన్ వున్న ఓ దినపత్రిక. ఈ దినపత్రిక కటింగ్ ఇరవై ఏళ్ల క్రితంది. అప్పుడే ఈ మంచినీటి కరువును ఎడిటోరియల్‌లో ఆ పత్రిక హెచ్చరించింది.''

''విశ్వవ్యాప్తంగా నూట ఇరవై (120) కోట్ల మంది నీటి కరువుతో నకనకలాడుతున్నారని చెప్పింది. నీరందక నీరసించి పోతున్న దేశాల సంఖ్య ప్రస్తుతం. ఇరవై తొమ్మిది కాగా 2025 నాటికి 65కు చేరుకుంటుందని అంచనా వేసింది.''

''ఆ అంచనా తప్పలేదు... అయినా బుద్ధి రాలేదు. ఫలితంగా నీళ్ల కోసం మూడవ ప్రపంచం యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కొన్ని దేశాలు ప్రపంచంలో మిస్సయ్యాయి. టూ బ్యాడ్ టు వరస్ట్'' సతీష్ చెప్పాడు.

***

గ్రేట్ వాటర్ షో చూసిన విదేశీయులు బయటకు వచ్చేసరికి, కుళాయుల ముందు మగవాళ్ళు క్యూ కట్టి బాటిల్‌తో నింపుకుంటున్నారు.

''అదేమిటి... వాళ్ళేం చేస్తున్నారు'' విదేశీయులు అడిగారు. కుళాయిల్లోని ద్రవం తాగి తూలుతున్న జనాన్ని చూసి.

మంచి నీళ్ల మీద పాలకులకు శ్రద్ధ లేకపోయినా, మద్యం మీద అది తెచ్చే ఇన్‌కమ్ మీద శ్రద్ధ బాగానే వుంది. నీటి కుళాయిలు బోసిపోతున్నాయాని, మద్యాన్ని కుళాయిల ద్వారా అందిస్తూ ముప్పొద్దులా మద్యం కుళాయిల ద్వారా వదులుతున్నారు. వాటర్ టాక్స్ బదులు, మద్యం టాక్స్ వసూలు చేస్తుంది గవర్నమెంట్. చెప్పాడు సతీష్ నిర్వికారంగా.

***

సరిగ్గా అదే సమయంలో అటక మీద వున్న చలపతి తండ్రి కోమాలో నుంచి బయటపడ్డాడు. దాహం దాహం అన్నాడు. వెంఠనే ఓ రెండు వాటర్ టాబ్లెట్లు అందించాడు చలపతి.

ఆ బిళ్ళలు ఏమిటో అడగకుండానే మింగి, స్నానం చేయాలి... నీళ్ళు తోడండి అన్నాడు.

ఓసారి తండ్రి వైపు జాలిగా చూసి కథ మొదట్నుంచీ చెప్పుకు వచ్చాడు చలపతి. మధ్య మధ్య కోడలు చారుమతి మొగుడు మిస్సయిన డీటేల్స్ అందిస్తూ వచ్చింది.

అంతా విని, విన్నది హరాయించుకోలేక, పిచ్చికేకతో సేమ్ అటక మీద విరుచుకుపడి పోయి....కోమాలోకి వె...ళ్ళి....పో.....యే....డు చలపతి తండ్రి. దట్సాల్.